సాక్షి
విశాఖపట్నం

మంగళవారం : 31 : జనవరి : 2023



అర్జీలు సత్వరం పరిష్కరించాలి

స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. 8లో



విద్యార్థుల వికాసానికి కృషి

గురుకుల విద్యార్థులు అన్ని రంగాల్లో వికాసం సాధించేలా కృషి చేస్తున్నట్టు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు. 8లో



శ్మశానాల అభివృద్ధికి శ్రీకారం

అన్ని జోన్లలోని శ్మశాన వాటికల అభివృద్ధికి జీవీఎంసీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. 8లో

వేల గొంతులు ఒక్కటై..

- నినదించిన ఉక్కు కార్మికులు
- పెద్ద ఎత్తున ప్రజా గర్జన బహిరంగ సభ
- బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకుల సంఘీభావం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో అఖిలపక్ష నాయకులు, ప్రజాగర్జనకు హాజరైన ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. వారితో పాటు బహిరంగ సభకు హాజరైన నాయకులు కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఉక్కునగరం త్రిష్నా మైదానంలో సోమవారం పెద్ద ఎత్తున ప్రజా గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గర్జనలో బీజేపీ మినహా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు, జీవీఎంసీ కార్పొరేటర్లు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారు. నేడు ఎకరా కోటి రూపాయలు ఉండగా నాడు ఎకరాకు కేవలం రూ.1,270లు చెల్లించారు. భూములు ఇచ్చిన 16,500 మందిలో ఇంకా 8,200 మందికి ఉద్యోగాలు లభించలేదు. అన్ని రాజకీయ పార్టీలు సమిష్టిగా ప్రధానిపై ఒత్తిడి తేవడం ద్వారానే ప్రైవేటీకరణ ఆగుతుంది.

– తిప్పల నాగిరెడ్డి, గాజువాక ఎమ్మెల్యే

టీడీపీ హయాంలో కార్మిక సంఘాలపై కేసులు

తమ పార్టీ మద్దతు వల్లనే గత రెండేళ్లుగా ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉద్యమం సాగుతుంది. గతంలో స్టీల్‌ప్లాంట్ బీఐఎఫ్ఆర్ బారిన పడినప్పుడు కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తే నాటి టీడీపీ ప్రభుత్వం వారిని అరెస్ట్ చేయించడంతో పాటు కేసులు పెట్టించింది. మొన్నటి వరకు ఆ కేసుల గురించి కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రస్తుతం ఉద్యమం స్వేచ్ఛగా జరుగుతుంది.

– అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెందుర్తి ఎమ్మెల్యే

ప్రారంభం నుంచి వైఎస్సార్ సీపీ మద్దతు

ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చి నాటి నుంచి వైఎస్సార్ సీపీ ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తుంది. తమ పార్లమెంటరీ నాయకుడు విజయసాయిరెడ్డి నేతృత్వంలో పాదయాత్ర చేశాం. అన్ని కార్యక్రమాలకు అధికార పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై స్పష్టమైన హామీ ఇచ్చారు.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

ఎంపీల ఒత్తిడి వల్లే సాధ్యం

అధికార పార్టీకి చెందిన 37 మంది ఎంపీలు వస్తే తమ ఎంపీలు కూడా వస్తారని.. తద్వారా 52 మంది ఎంపీలతో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీద్దాం. అప్పుడు కేంద్ర ప్రభుత్వం తలొగ్గాల్సిందే. తగిన కృషి చేయకపోతే చరిత్ర హీనులుగా మారుతారు.

– కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

గుజరాతీలకు మాత్రమేనా మాఫీ...

గుజరాతీలకు రూ. 16 లక్షల కోట్లు మాఫీ చేసిన ప్రధాని మోదీ విశాఖ ఉక్కుకు కేవలం రూ. 5 వేలు ఈక్విటీగా ఎందుకు మార్చారు. సీపీఐ రామకృష్ణ ప్రతిపాదన మేరకు తమ పార్టీకి చెందిన ఎంపీలు రాజీనామాకైనా సిద్ధం. అధికార పార్టీ కూడా ఈ సవాల్‌ను స్వీకరించాలి.

– బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ మంత్రి

రాష్ట్ర ప్రజలను భాగస్వాములను చేయాలి..

ఈ ఉద్యమాన్ని రాష్ట్ర ఉద్యమంగా మార్చాలి. తద్వారా 5 కోట్ల మందిని ఉద్యమంలోకి భాగస్వాములను చేయాలి. ఆత్మనిర్భర్ అంటే పోస్కో వంటి విదేశీ సంస్థలకు పరిశ్రమలను అప్పగించడం కాదు. పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు తమ గళం విప్పాలి.

– కె.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

గాజువాక ప్రజానీకం ఉద్యమించాలి...

గాజువాక ప్రజానీకం మొత్తం ఉద్యమించాలి. గతంలో మాజీ ప్రధానులు వాజ్‌పేయ్, మన్మోహన్ సింగ్‌లపై నాటి రాష్ట్ర ప్రభుత్వాలు ఒత్తిడి తెస్తే వారు సానుకూలంగా స్పందించి స్టీల్‌ప్లాంట్‌కు సాయం అందించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే ఫలితం ఉంటుంది.

– పల్లా శ్రీనివాసరావు, గాజువాక మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ వల్లే పీఎస్‌యూల ఏర్పాటు

ప్రధాని మోదీ పీఎస్‌యూలను గుజరాతీలకు పప్పు, బెల్లాలు లాగ పంచి పెడుతున్నాడు. రాహుల్ గాంధీ జోడో యాత్ర పూర్తయిన తర్వాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీసుకు వస్తాం. పార్లమెంట్‌లో తమకు ఉన్న 57 మంది ఎంపీలతో విశాఖ ఉక్కుపై నిలదీస్తాం.

– రాకేశ్ రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

గల్లీ నుంచి ఢిల్లీకు ఉద్యమించాలి

ఈ ఉద్యమాన్ని ఈ ప్రాంతానికి పరిమితం చేయకుండా ఢిల్లీ స్థాయికు విస్తరించేలా చేయాలి. ప్రైవేటీకరణ నిర్ణయం వెలువడిన వెంటనే తమ అధినేత పవన్ కల్యాణ్ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలను కలిసి ప్రైవేటీకరణ విరమించాలని చెప్పడం జరిగింది.

– కోన తాతారావు, జనసేన నాయకులు

బీజేపీని రాష్ట్రంలో బహిష్కరించాలి

రాష్ట్రంలో బీజేపీని ప్రజలు బహిష్కరిస్తే కేంద్రం కచ్చితంగా దిగి వస్తుంది. బీజేపీ నాయకుల మాటలు, చేతలు వేర్వేరుగా ఉంటున్నాయి. విశాఖకు ప్రధాని వస్తే ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడలేదు.

– పోతిన రామారావు, ఆప్ నాయకులు

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర గవర్నర్ రాక



మహారాణిపేట : రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ మంగళవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. ఏయూ కాన్వొకేషన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు పోర్టు గెస్టు హౌస్ చేరుకొని కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 2.20 గంటలకు పోర్టు గెస్టుహౌస్ నుంచి బయలు దేరి చినముషిడివాడ శ్రీ శారదా పీఠానికి చేరుకుంటారు. 3 నుంచి 3.15 గంటల వరకు శారదాపీఠంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 3.45 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి విమానంలో గన్నవరం వెళ్తారు.

శంకరమఠాన్ని సందర్శించిన హర్యానా గవర్నర్



విజయేంద్ర సరస్వతిని కలిసిన బండారు దత్తాత్రేయ

సీతంపేట: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం మధ్యాహ్నం శంకరమఠంకు విచ్చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతిని మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. స్వామివారు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇకపై డయల్ యువర్ పోలీస్ కమిషనర్

- సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీపీ శ్రీకాంత్
- ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహణ

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖలో నేర నియంత్రణకు చేపడుతున్న ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్న నేపథ్యంలో మరో కొత్త కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ముందడుగు వేశారు. ప్రతి నెల మొదటి శుక్రవారం డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించి.. నగర ప్రజల సమస్యలు, ఫిర్యాదులు స్వయంగా స్వీకరించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రజల నుంచి సమస్యలు తెలుసుకోనున్నారు. 0891-2523408 నెంబర్‌కు ఫోన్ చేసి సీపీకి స్వయంగా సమస్యలు, ఫిర్యాదులు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం స్పందన ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఈ డయల్ యువర్ పోలీస్ కమిషనర్ ద్వారా పోలీస్ కార్యాలయానికి రాకుండానే నేరుగా సీపీకే ఫోన్ చేసి తమ గోడును విన్నవించుకునే వెసులుబాటు కలగనుంది.

అన్మిష్ వర్మకు అభినందన



అన్మిష్ వర్మను సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్

మహారాణిపేట: అంటార్కిటికాలో ఎత్తయిన పర్వతమైన మౌంట్ విన్సన్‌ను అధిరోహించిన పీఎం పాలెం ప్రాంతానికి చెందిన భూపతిరాజు అన్మిష్ వర్మను సోమవారం జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అభినందించారు. ప్రపంచంలోని ఏడు శిఖరాల చాలెంజ్‌లో భాగంగా ఈనెల 22న అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ను అధిరోహించి అరుదైన ఘనతను సాధించారన్నారు. ప్రపంచంలోని కొద్దిమంది మాత్రమే ఈ సవాల్ విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అన్మిష్ వర్మను జేసీతోపాటు డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష అభయాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సత్కరించారు.

పోలీస్ కమిషనర్ మానవత్వం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): పోలీసు స్పందనలో వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన 85 ఏళ్ల వృద్ధుడిని నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ ఆదరించారు. నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కూడలి వద్ద ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందని, వృద్ధులు, పిల్లలు నడవడానికి ఇబ్బందిగా ఉందని, ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని పోలీస్ కమిషనర్‌ను పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం (85) విజ్ఞప్తి చేశారు. ఆ పెద్దాయన ఒంటరిగా వచ్చారని తెలుసుకుని, ఫోర్త్‌టౌన్ సీఐ వాహనంలో ఇంటి వరకు డ్రాప్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



లోకేష్, సాయికుమార్ (ఫైల్)

పరవాడ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందగా ఓ విద్యార్థి స్వల్పంగా గాయపడ్డాడు. అనకాపల్లి–పరవాడ రహదారిలో పరవాడ శ్మశాన వాటిక సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భర్నికం గ్రామానికి చెందిన మునసాల కోటేశ్వరరావు, వెంకటలక్ష్మి కుమారుడు లోకేష్(14) స్టీల్‌ప్లాంట్‌లో శివశివానీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పెదపాటి వెంకటరావు, పాప దంపతుల కుమారుడు సాయికుమార్(13) పరవాడ జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి, అదే పాఠశాలలో ద్వారపూడి పవన్(16) పదో తరగతి చదువుతున్నారు. ముగ్గురు కలిసి సోమవారం ఉదయం స్కూటీపై పరవాడ జెడ్పీ పాఠశాలకు వెళుతున్న క్రమంలో పరవాడ శ్మశానవాటిక వద్ద మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెదపాటి సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి చికిత్స కోసం తరలిస్తున్న మునసాల లోకేష్ మార్గంమధ్యలో ప్రాణాలు విడిచాడు. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ద్వారపూడి పవన్ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయా ఇళ్లలో ఉన్న ఏకైక కుమారులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో తమకు దిక్కెవరని లోకేష్, సాయికుమార్ కుటుంబాలు బోరున విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును పరవాడ సీఐ పి.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఎస్ఐ తేజేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

మరో నాలుగు బీచ్‌ల అభివృద్ధి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీ–20 సదస్సు నేపథ్యంలో నగర వాసులు, పర్యాటకులను ఆహ్లాద పరిచేందుకు మరో నాలుగు బీచ్‌లు అభివృద్ధి చేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, తొట్లకొండ, మంగమారిపేట ప్రాంతాల తీరాలను ఆర్కే బీచ్ తరహాలో సుందరంగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు, పర్యాటకులు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్స్, ఫుడ్‌కోర్టులు, విద్యుత్ దీపాలు వంటివి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. జీ–20 సదస్సు నిధులతోనే ఆయా పనులు చేపట్టనున్నట్టు చెప్పారు.

షార్ట్ టెండర్ల ద్వారా పనులు

జీ–20 సదస్సుకు సంబంధించిన పనులను షార్ట్ టెండర్ల ద్వారా అప్పగిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రతి పనిపైనా పర్యవేక్షణ ఉంటుందన్నారు. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో ప్రతి 300 మీటర్లకు ఓ మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. నగరంలోని గెడ్డల్లో వ్యర్థాలు వేయడాన్ని అరికట్టేలా విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఇనుప మెస్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఐదేళ్లు దాటడంతో పెందుర్తి ప్రాంతంలో మొక్కల వేర్లు గోడల్లోకి చొచ్చుకుపోయానని, అవి కూలిపోయే అవకాశం ఉండడంతో మొక్కలు తొలగించడం జరిగిందన్నారు. శారదా పీఠం ప్రతినిధులు గతంలో ఓ స్వచ్ఛంద సంస్థతో మొక్కలు విభాగినిలో వేయించారని, వాటిని పరిశీలించిన తర్వాతే తొలగించామన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. ఆస్పత్రికి రూ.15 లక్షల జరిమానా

బీచ్‌రోడ్డ (విశాఖ తూర్పు): వైద్యుల నిర్లక్ష్యంపై వినియోగదారుల ఫోరం కొరడా ఝులిపించిందని ఆశ్ర చీఫ్ ప్యాట్రన్ హబీబ్ సుల్తాన్ అలీ చెప్పారు. లాజర్స్ ఆస్పత్రిపై వినియోగదారుల ఫోరం కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన మీడియాకు వివరించారు. సత్యవాణి అనే మహిళ ఎడమ చెయ్యి నొప్పితో లాజర్స్ ఆస్పత్రిలో చేరింది. అక్కడ డాక్టర్ ఎస్.గోపి పర్యవేక్షణలో చికిత్స అందించారన్నారు. 24 గంటలైనా నొప్పి తగ్గకపోవడంతో మరో ఆస్పత్రిలో సంప్రదించారని తెలిపారు. అయితే లాజర్స్ వైద్యులు అందించిన వైద్యం సరైందని కాకపోవడంతో బాధిత మహిళ చెయ్యిని తొలగించారన్నారు. ఆస్పత్రి నిర్వాకంపై ఆశ్ర ద్వారా వినియోగదారుల ఫోరంలో బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఫోరం మెడికల్ నెగ్లిజెన్స్ కింద లాజర్స్ ఆస్పత్రికి రూ.15 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇది వినియోగదారుల విజయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షల నగదు లభ్యం

సీతమ్మధార : ప్రైవేట్ ట్రావెల్ బస్సులో రూ.35 లక్షల నగదు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరానికి చెందిన కరన్ సింగ్ అనే వ్యక్తి సోమవారం రాత్రి ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సులో రూ.35 లక్షల నగదుతో ప్రయాణం సాగిస్తున్నాడు. గంజాయి అని అనుమానంతో అక్కయ్యపాలెం వద్ద బస్సు కండక్టర్ బ్యాగ్ తనిఖీ చేయగా నగదు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు నగదును స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో బంగారం, వెండి కొనుగోలు చేయడానికి తీసుకువెళ్తున్నట్లు కరన్ సింగ్ తెలియపరిచినట్లు ఫోర్తుటౌన్ లా అండ్ ఆర్డర్ పోలీసులు తెలిపారు.

జగనన్న చేదోడు రూ. 15.80 కోట్లు



చెక్కు అందజేస్తున్న జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రజక, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు

లబ్ధిదారుల ఖాతాలో జమ

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : జగనన్న చేదోడు పథకం 2022–23కి గానూ లబ్ధిదారులకు వరుసగా మూడో విడత నగదు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండ నుంచి సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో జగనన్న చేదోడు మూడో విడత ఆర్థిక సహాయం కింద అర్హులైన రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు ఒక్కొక్కరికీ రూ. పది వేల చొప్పున మొత్తం 15,805 మంది లబ్ధిదారులకు గాను రూ. 15.80 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాకు సంబంధించి జగనన్న చేదోడు పథకం కింద 6,483 దర్జీలకు, 1,967 నాయీ బ్రాహ్మణులకు, 7,355 రజకులకు కలిపి మొత్తం రూ.15.80 కోట్లు లబ్ధి చేకూరింది. జగనన్న చేదోడు లబ్ధి విడుదల కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి ప్రారంభించగా, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ వీడియో కాన్ఫరెన్సు హాలులో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం జిల్లాలో లబ్ధిదారులకు మంజూరైన రూ. 15,80,50,000 మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయాలు జిల్లా ఇన్‌చార్జి అధికారి పూర్ణిమ దేవి, యూసీడీ పీడీ నాయుడు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఇ.యువశ్రీ , నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వి.నూకరాజు, నాయీ బ్రాహ్మణ సిటీ ప్రెసిడెంట్ సుబ్బారావు , వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాథ్, అధికారులు, పలువురు లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.

సత్యమార్గంలో నడుద్దాం..



మహాత్ముడికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రెహ్మాన్ తదితరులు



జాతిపితకు నివాళులర్పిస్తున్న మేయర్ వెంకట కుమారి, కమిషనర్ రాజాబాబు తదితరులు

మహారాణిపేట : మహాత్మా గాంధీ చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మద్దిలపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్ముడి చిత్ర పటం వద్ద పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు డాక్టర్ ఎస్.ఎ.రెహ్మాన్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సభ్యుడు బి.కాంతారావు, కార్పొరేషన్ చైర్మన్ సుజాత సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, పార్టీ ముఖ్య నాయకులు అల్లంపల్లి రాజ బాబు, ఐ.హెచ్. ఫరూఖీ, సతీష్ వర్మ, పేడాడ రమణి కుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ, మొల్లి అప్పారావు, పేర్ల విజయచందర్, కె.రామన్నపాత్రుడు, బోని శివరామకృష్ణ, యువశ్రీ, రాయుడు శ్రీను, సాగరిక, అజయ్ కుమార్, కేవీ బాబా పాల్గొన్నారు.

గాంధీ మార్గాన్ని అనుసరించాలి..

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమీపంలోని గాంధీ విగ్రహానికి మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సత్యమార్గంలో నడవాలని మేయర్ సూచించారు. కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ అప్పట్లో గాంధీ త్యాగఫలమే..భారతదేశ ప్రజల జీవన మనుగడకు, శాంతి సామరస్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన శారదాపీఠం వార్షికోత్సవాలు



రాజశ్యామల అమ్మవారికి హారతి అందజేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న స్వామీజీలు

సింహాచలం: శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు నాల్గోరోజు సోమవారం అంబరాన్నంటాయి. యజ్ఞ యాగాదులు, వేద పారాయణతో పీఠం మార్మోగింది. లక్ష మూల మంత్రాలతో చేపట్టిన రాజశ్యామల యాగం వైభవంగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస చదుర్వేద హవనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాజశ్యామల అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పూజలు నిర్వహించి హారతులు అందజేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఆగమ సలహా మండలి సభ్యులతో స్వామీజీ సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. వార్షికోత్సవాల్లో భాగంగా స్వాత్మానందేంద్ర సరస్వతి సారథ్యంలో సచ్చిదానంద విద్వత్ సభ పేరిట శాస్త్ర సభను ఘనంగా నిర్వహించారు. పలువురు శాస్త్ర, ఆగమ, వేదపండితులు పాల్గొని తమ పాండిత్యాన్ని ప్రదర్శించారు. బుట్టేవారి గంటల పంచాంగాన్ని స్వామీజీలు ఆవిష్కరించారు. సాయంత్రం శారదా స్వరూప రాజశ్యామల చంద్రమౌళీశ్వరులకు నిత్య పీఠార్చన విశేషంగా జరిగింది. మంగళవారం జరిగే మహా పూర్ణాహుతితో వార్షికోత్సవాలు ముగియనున్నాయి. శారదాపీఠాన్ని సోమవారం హర్యానా గవర్నర్ బండారు దాత్తాత్రేయ సందర్శించారు.

వేడుకగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం

సోమవారం సాయంత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవాన్ని చినముషిడివాడ ప్రధాన రహదారిలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి రథంలో వేంజేంపచేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి స్వామీజీలు నారికేళాలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తప్పెట గుళ్లు, డప్పు వాయిద్యాలు, కాళీ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పీఠం ప్రాంగణంలో వల్లీ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

శ్మశానాల అభివృద్ధికి శ్రీకారం

- జి-20 సదస్సు అంతర్జాతీయ సదస్సుల నేపథ్యంలో..
- అన్ని జోన్లలో శ్మశానవాటికల ఆధునికీకరణ
- కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి రంగం సిద్ధం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : జీవీఎంసీ అన్ని జోన్లలోని పలు శ్మశాన వాటికల అభివృద్ధికి జీవీఎంసీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా బుధవారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో పలు శ్మశాన వాటికలకు సంబంధించి కౌన్సిల్ సభ్యుల ముందుకు చర్చకు రానున్నాయి. జి-20 సదస్సు, ఇన్ఫినిటీ వైజాగ్ 2023, వైజాగ్ టెక్ సమ్మిట్, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వంటి ప్రతిష్టాత్మక శిఖరాగ్ర సమావేశాల దృష్ట్యా, అన్ని జోన్లలోని శ్మశాన వాటికల అభివృద్ధికి అవసరమైన పరిపాలనా అనుమతులు, పరిపాలన పరమైన ఆమోదానికి ప్రణాళికలు రూపొందించారు. ముఖ్యంగా నగర శివారులోని శ్మశాన వాటికల అభివృద్ధి, గాజువాక, పెదగంట్యాడలోని శ్మశానవాటికను విద్యుత్ దహన వాటికగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. పలు శ్మశాన వాటికలు ఆధునీకరణ, ప్రహరీల నిర్మాణం, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కౌన్సిల్ సభ్యుల ముందుకు ప్రధానంగా చర్చకు రానున్నాయి.

- గాజువాక జోన్ 85వ వార్డులోని మంత్రిపాలెం శ్మశాన వాటికకు రూ.97.65 లక్షలతో బర్నింగ్ ప్లాట్ఫారం, ప్రహరీ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు.
- గాజువాక జోన్ 79వ వార్డులోని అగనంపూడి శ్మశాన వాటికకు రూ.97.85 లక్షలతో బర్నింగ్ ప్లాట్ఫారం, ప్రహరీ నిర్మాణం.
- గాజువాక జోన్ 79వ వార్డులోని లంకెలపాలెం ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు రూ.91.90 లక్షలతో ప్రహరీ నిర్మాణం. ఇదే వార్డు లంకెలపాలెం శ్మశాన వాటికకు రూ.99.25 లక్షలతో బర్నింగ్ ప్లాట్ఫారం, ప్రహరీ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు.
- జోన్-2 పరిధి 6వ వార్డు బక్కన్నపాలెంలోని శ్మశానవాటికను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సుమారు 2.13 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్మశానవాటికను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. శ్మశానవాటిక ఆధునికీకరణకు రూ.కోటి 80 లక్షల జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తూ, పరిపాలన ఆమోదానికి, టెండర్లు పిలిచేందుకు కౌన్సిల్ సభ్యుల ముందుకు చర్చకు రానుంది.
- జోన్-2 పరిధి 7వ వార్డు వాంబేకాలనీలో గల శ్మశాన వాటికను రూ.95 లక్షలతో ఆధునీకరించేందుకు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తూ పరిపాలన ఆమోదానికి, టెండర్లు పిలిచేందుకు కౌన్సిల్ సభ్యుల ముందుకు చర్చకు రానుంది. అలాగే అదే వార్డు చంద్రంపాలెం శ్మశాన వాటికను రూ.85 లక్షలతో అభివృద్ధి చేసేందుకు చర్చకు రానుంది.
- జోన్-2 పరిధి 8వ వార్డు ఎండాడలో గల శ్మశాన వాటికను రూ.80 లక్షలతో ఆధునికీకరించే అంశం కౌన్సిల్ సభ్యుల ముందుకు చర్చకు రానుంది. అలాగే ఇదే వార్డు పిలకవానిపాలెం శ్మశానవాటికను రూ.80 లక్షలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.
- జోన్-2 పరిధి 9వ వార్డు జోడుగుళ్లపాలెం శ్మశాన వాటిక రూ.60 లక్షలతో ఆధునీకరించేందుకు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తూ పరిపాలన ఆమోదానికి, టెండర్లు పిలిచేందుకు కౌన్సిల్ సభ్యుల ముందుకు చర్చకు రానుంది.
- జోన్-1 పరిధి 3వ వార్డు గాడువీధి, బుడ్డోడు గెడ్డలో గల శ్మశాన వాటికను రూ.కోటి 10 లక్షలతో ఆధునీకరించేందుకు చర్చకు రానుంది.
- గాజువాక జోన్ 75వ వార్డు పెదగంట్యాడ శ్మశాన వాటికను రూ.58.15 లక్షలతో పొగ రహిత విద్యుత్ కొలిమిని నిర్మాణానికి, రూ.96.60 లక్షలతో బర్నింగ్ ప్లాట్ఫాం నిర్మాణానికి..రూ.87.80 లక్షలతో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు..
- జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలో రూ.97.70 లక్షలతో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు..
- జోన్-8 పరిధి 92వ వార్డు వెంకటాపురం శ్మశాన వాటికను రూ.98 లక్షలతో సరిహద్దు రక్షణగోడ, మంచి నీటి సదుపాయం, రహదారులు, విశ్రాంతి మందిరం, విద్యుద్దీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు..
- 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో గల గొల్లవిల్లి పాలెం శ్మశాన వాటికలో రూ.99 లక్షలతో సరిహద్దు రక్షణగోడ, మంచి నీటి సదుపాయం, రహదారులు, విశ్రాంతిమందిరం, విద్యుదీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు.

పోలీస్ స్పందనకు 30 వినతులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా సత్వరమే పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శ్రీకాంత్ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్బీ) డి.గంగాధర్, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యంతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సంజీవని డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు ఆర్థిక సాయం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): సంజీవని-డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది తమవంతు సాయంగా రూ.20,700 అందజేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌కు అందజేశారు.

గ్యాస్ సిలిండర్ల అదనపు వసూళ్లపై టోల్ ఫ్రీ నంబర్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ డెలివరీ బోయ్‌లకు ప్రభుత్వం అనుమతించిన దాని కంటే ఎక్కువగా రుసుం వసూలు చేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడానికి వీలు కల్పించారు. అలాగే ఎల్‌పీజీ వినియోగదారుల టోల్ ఫ్రీ నంబర్ 1967 ద్వారా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఫిర్యాదు చేయవచ్చు. ఆయిల్ కంపెనీ వారి టోల్‌ఫ్రీ నంబర్ 1800 2333555కు ఫిర్యాదు చేయవచ్చునని జిల్లా పౌరసరఫరాల అధికారి సోమవారం తెలిపారు. ఐదు కిలోమీటర్ల వరకు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని, 5-15 కిలో మీటర్లలోపు వారు మాత్రం సిలిండర్‌కు రూ.20, 15 కిలో మీటర్లు దాటితే రూ.30 చార్జీగా నిర్ణయించారు.

జీవీఎంసీ స్పందనకు 52 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సంయుక్తంగా నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 52 వినతులు వచ్చాయి. వీటిలో జోన్-1 నుంచి రెండు, జోన్-2 నుంచి మూడు, జోన్-3 నుంచి 11, జోన్-4 నుంచి మూడు, జోన్-5 నుంచి పన్నెండు, జోన్-6 నుంచి ఏడు, జోన్-8 నుంచి నాలుగు, ప్రధాన కార్యాలయానికి రెండు ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో పరిపాలన, అకౌంట్స్ విభాగానికి ఎనిమిది, రెవెన్యూకి మూడు, ప్రజారోగ్యానికి రెండు, టౌన్‌ప్లానింగ్‌కు 23 ఇంజనీరింగ్/హార్టికల్చర్‌కు 11 యూసీడీకి ఐదు వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించి వచ్చిన ఫిర్యాదులను 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మేయర్, కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప ప్లానర్ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజనీర్లు, టౌన్‌ప్లానింగ్, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి


వినతులు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనపై ప్రజలకు బలమైన నమ్మకం కలిగేలా పరిష్కారం చూపాలన్నారు. ఆయా శాఖల అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులందరూ ముఖ ఆధారిత హాజరు నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం నాటి స్పందనకు 165 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి ,ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

24న న్యాయవాదుల సంఘ ఎన్నికలు

విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వచ్చే నెల 24న ఎన్నికలు జరుగుతాయని సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ చెప్పారు. న్యాయవాదుల సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. సీనియర్ న్యాయవాదులు గొలగాని అప్పారావు, షేక్ షరీఫ్, పాకా సత్యనారాయణ, ఐఎల్ఏ నగర అధ్యక్షుడు వెంకటేశ్వరావు, అమర్, సోమేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం బార్‌కౌన్సిల్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వచ్చేనెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై 24తో ముగుస్తుంది. న్యాయవాదుల సూచల మేరకు ఎన్నికల ప్రక్రియకు వీలుగా ఎన్నికల అధికారిని నియమిస్తామని న్యాయవాదుల సంఘం ప్రాధాన కార్యదర్శి ఎల్లపు వేణుగోపాల్ తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్

విశాఖ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ వచ్చేనెల 16 నుంచి ప్రారంభమవుతుంది. తొలుత ఎన్నికల అధికారిని నియమిస్తారు. 16న వివిధ పదవులకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారు. 17 నుంచి 21 వరకు నామినేషన్ల పరిశీలిస్తారు. 21 సాయంత్రంలోపు ఉపసంహరణల అవకాశం ఉంటుంది. అనంతరం తుది జాబితా ప్రకటిస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికలు జరగుతాయి. అదే రోజు సాయంత్రం 5గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను ప్రకటిస్తారు.

విద్యార్థుల వికాసానికి కృషి

జీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

సింహాచలం: రాష్ట్రంలోని మహాత్మా జ్యోతీబాపులే ఏపీ బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అన్నిరంగాల్లో పరిపూర్ణ వికాసం సాధించే దిశగా కృషి చేస్తున్నట్టు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి కె.కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు రెండవరోజు సోమవారం కొనసాగాయి. ఈసందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ మీట్‌లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మూడు రోజులపాటు జరుగుతున్న ఈ స్పోర్ట్స్ మీట్‌కి రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 800మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జోన్-2 గైడెన్స్ఆఫీసర్ ఎ.వి.సూరిబాబు, జోన్-3 అకడమిక్ గైడెన్స్ అధికారి కె.అక్కారావు, సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, రాష్ట్రస్థాయి క్రీడా పోటీ నిర్వాహక అధ్యక్షుడు డి.సత్యారావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

- సోమవారం జరిగిన పలు పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభ కనబరిచారు. చెస్ బాలుర విభాగంలో ఎ.అవినాష్(తూర్పుగోదావరి) ప్రథమస్థానంలోను, వి.చరణ్(కడప)ద్వితీయస్థానంలోను నిలిచారు.
- చెస్ బాలికల విభాగంలో వి.లత(కడప) ప్రథమ, కె.సి.బ్రహ్మిత(నెల్లూరు)ద్వితీయస్థానంలో నిలిచారు.
- క్యారమ్స్ డబుల్స్ బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఎం.అశోక్, ఎ.హరినాథ్(నెల్లూరు), ద్వితీయస్థానంలో పి.ఎల్లయ్య, కె.మోహన్‌సాయి(ప్రకాశం) నిలిచారు.
- హైజంప్ బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో కె.నవనీత్(విశాఖ), ద్వితీయస్థానంలో ఎస్.జయవర్ధన్(విశాఖ), తృతీయ స్థానంలో కె.రామకౌశిక్(ప్రకాశం) నిలిచారు.
- షార్ట్‌పుట్ బాలురు విభాగంలో కె.రమేష్(తూర్పుగోదావరి) ప్రథమస్థానంలోను, సీహెచ్.నాగ నరేష్(గుంటూరు) ద్వితీయస్థానంలోను, డి.వసంత్(అనంతపురం) తృతీయస్థానంలోను నిలిచారు.
- షార్ట్‌పుట్ బాలికల విభాగంలో కె.మానస(కర్నూలు)ప్రథమస్థానం, ఎం.వర్షిక(గుంటూరు)ద్వితీయస్థానం, కె.జ్యోతిశ్రీ(చిత్తూరు)తృతీయస్థానంలోను నిలిచారు. కోకో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను కూడా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

తీరంలో 'దిల్‌వాలా' సందడి


హీరో నరేష్ అగస్త్యకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు వీరభద్రమ్ చౌదరి

కొమ్మాది (భీమిలి): భీమిలి బీచ్ రోడ్డు, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు వీరభద్రమ్ చౌదరి తెరకెక్కిస్తున్న దిల్‌వాలా సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో నరేష్ అగస్త్య (సేనాపతి ఫేమ్), హీరోయిన్ శ్వేత (మెరిసే మెరిసే ఫేమ్) నటిస్తున్న ఈ సినిమాలో హీరోని లారీ ఢీకొట్టే సంఘటన, కొన్ని ఫైటింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్‌పై నబిషేక్, నర్సింహా నిర్మాతలుగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్, లహరి, ఆలీరాజా, అవినాష్ నటిస్తున్నారు. క్రైమ్, కామిడీ కథాంశంతో నిర్మితమవుతున్న ఈ సినిమాకు అనూప్ సంగీతం అందిస్తున్నారని, మొదటి షెడ్యూల్ బ్యాంకాక్‌లో పూర్తయ్యిందని, రెండో షెడ్యూల్ విశాఖ ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు వీరభద్రమ్ చౌదరి తెలిపారు.

మహిళా క్రికెటర్లకు పింఛన్ సౌకర్యం

ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి


కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మహిళా క్రికెటర్లు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర క్రికెట్ సంఘం(ఏసీఏ) అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డితో చర్చించి రాష్ట్రంలోని మహిళా క్రికెటర్లకు పింఛన్ సౌకర్యాన్ని కల్పిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. మహిళా క్రికెటర్లు విశాఖలో సోమవారం ఆయన్ని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరత్‌చంద్రరెడ్డి నాయకత్వంలో పురుష క్రికెటర్లకు పింఛన్ సౌకర్యం కల్పించింది ఒక్క ఏసీఏ అని తెలిపారు. మహిళా క్రికెట్ అభివృద్ధికి రాబోయే రోజుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత ఉన్న కోచ్‌లు, ట్రైనర్లకు సెలెక్టర్లుగా అవకాశం కల్పిస్తామన్నారు. భారత మహిళల అండర్-19 జట్టు ప్రపంచ కప్ సాధించడం మహిళా క్రికెట్ దేశవ్యాప్తంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. ఏపీ మహిళా క్రికెట్ సంఘం కార్యదర్శి మచ్చా రామలింగారెడ్డితో సహా 40 మంది మహిళా క్రికెటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సన్మానించారు.

'వ్యాస్' బయోగ్రఫీ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కరణం సత్యనారాయణ రాసిన దివంగత ఐపీఎస్ అధికారి కె.ఎస్.వ్యాస్ బయోగ్రఫీ పుస్తకాన్ని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అభ్యున్నతికి వ్యాస్ కృషి చేశారని, ఆయన ఆలోచన నుంచే గ్రేహౌండ్స్ ప్రాణం పోసుకుందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆదర్శప్రాయుడైన వ్యాస్ కోసం పుస్తకంలో బాగా వివరించారని పేర్కొన్నారు. వ్యాస్ కోసం ఎంతో ఓర్పుతో వివరాలు సేకరించి పుస్తకాన్ని రాసిన రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కరణం సత్యనారాయణను అభినందించారు.

పర్యాటక ప్రాంతాల్లో గిరిజన యువత సందడి


కైలాసగిరిపై గిరిజన యువకులు

కొమ్మాది (భీమిలి): వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన యువకులు సోమవారం విశాఖలోని పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్‌కే బీచ్, కై లాసగిరి, సబ్‌మెరిన్ సందర్శించారు. రుషికొండలో జరుగుతున్న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా గిరిజన యువకులకు మనోవికాసానికి, ఆత్మ స్థైర్యం పెంపొందించేందుకు క్షేత్ర స్థాయి సందర్శన నిర్వహించినట్టు తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ ఎఆర్ విజయారావు అన్నారు. పర్యటన అనంతరం గిరిజన యువతతో జనరల్ మేనేజర్ ఇంతియాజ్ మాట్లాడుతూ యువత తమ కెరీర్, వాటిని చేరుకునే నైపుణ్యాలు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశం సద్వినియోగం చేసుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన యువతకు ఇలాంటి ఫీల్డ్ విజిట్ ఎంతో దోహదపడుతుందన్నారు.

నేడు రాష్ట్ర సమాచార కమిషనర్ రాక

దొండపర్తి(విశాఖ దక్షిణ): రాష్ట్ర సమాచార కమిషనర్ బి.వి.రమణకుమార్ మంగళవారం విశాఖకు రానున్నారు. ఉదయం 8 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి 11 గంటలకు విశాఖ చేరుకుంటారు. రాత్రి కైలాసగిరి వద్ద పోలీస్ అతిథి గృహంలో బస చేస్తారు. మరుసటి రోజు 1వ తేదీన నగరంలో జరిగే వివిధ కార్యక్రమాలకు హాజరవుతారు. సాయంత్రం 4.30కు విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడ బయలుదేరుతారు.